

ఉపాధి కూలీలకు భరోసా..

- రూ. 20కే రూ. 2లక్షల బీమా
- పీఎంఎస్‌బీవైతో ఆర్థిక భద్రత
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఈ నెలాఖరు వరకు గడువు



7

నారుమడిలో.. రైతన్న సవ్వడి



అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీ బిజీగా మారారు. వారం క్రితం వరకు వరుణదేవుడి కోసం ఆశతో ఎదురుచూసిన రైతులకు ఏకధాటిగా కురుస్తున్న వానలు ఊరటనిచ్చాయి. మరోవైపు దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కడెం ప్రాజెక్టు ద్వారా సాగు నీటిని విడుదల చేయడంతో, బోరుబావులు, వ్యవసాయ బావుల కింద, రైతన్నలు వరిసాగు నాటుకు సిద్ధమవుతున్నారు. పలువురు రైతులు కాడెడ్లతో దుక్కులు దున్నుతున్నారు. మరో పక్క ట్రాక్టర్ ద్వారా పొలాల్లో నాటు వేసేందుకు జంబు కొట్టిస్తున్నారు. కూలీలతో నాట్లు వేయించడం, నారు తీయడం, పొలం మడులు, ఒడ్లు చెక్కించడం తదితర పనుల్లో రైతులు, కూలీలు బీజీ బీజీగా ఉన్నారు. -దండేపల్లి(ఆంధ్రజ్యోతి)







మెరుగైన వైద్యం అందుతోందా...

- రోగులను అడిగిన కలెక్టర్ కుమార్ దీపక్



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, జూలై27 (ఆంధ్రజ్యోతి): మీకు మెరుగైన వైద్యం అందిస్తున్నారా..? సమయానికి మందులు పంపిణీ చేస్తున్నారా..? అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదివారం పట్టణంలోని వందపడకల ఏరియా ఆసుపత్రిలోని రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువార్డులను సందర్శించారు. అనంతరం వైద్యులకు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎంతమంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారని రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డులో ఎంత మంది పేషేంట్లు, వారికి ఏ విధంగా వైద్య సేవలందిస్తున్నారని వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనారోగ్యాలకు రోగులకు సుదూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకంతో వస్తారని వారికి అన్నిరకాలుగా భరోసా కల్పిస్తూ మెరుగైన వైద్యం అందించడం వైద్యులు, సిబ్బంది కర్తవ్యమన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

అవినీతికి సహకరిస్తున్న అధికారులు

- మంచిర్యాలలో కబ్జాలు, దాడులతో అరాచక పాలన
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు చేస్తున్న అవినీతికి కొమ్ముకాస్తున్న అధికారులు భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కాలనీలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ విధుల నుంచి వెళ్లిపోవడానికి ఇక్కడి ఎమ్మెల్యే అవినీతే కారణమని ఆరోపించారు. మంచిర్యాలలో ఎటు చూసినా భూకబ్జాలు, దాడులతో, ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ రానున్న రోజుల్లో కనుమరుగు అవుతుందని జోస్యం చెప్పారు. ప్రతి పక్షంలో ఉన్న తాను ఈ ప్రాంత నాయకులను, కార్యకర్తలను, ప్రజలను కాపాడుకోవడం బాధ్యత అన్నారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన మరుక్షణం సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు అధికారులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమపై కేసులు పెడుతున్నారని, కాంగ్రెస్ నాయకులు ఎలాంటి విధ్వంసం చేసినా కేసులు నమోదు చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రేంసాగర్‌రావు ఓడిపోతే హైద్రాబాద్‌కు పరిమితమవుతాడని, ప్రస్తుతం తప్పు చేసిన అధికారులు మాత్రం ఈ ఇక్కడే ఉంటారని, ఇది గమనించి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మంచిర్యాల, నస్పూర్ పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, అక్కూరి సుబ్బన్న, నాయకులు తిరుపతి, వడ్లకొండ రవి, సుధీర్, అత్తి సరోజ, పల్లె భూమేష్, రవీందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్..



- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు
- అడ్‌హాక్ విధానంలో ప్రమోషన్లు ఇవ్వాలని విన్నపం
- జిల్లాలో సుమారు వంద మంది టీచర్లకు లబ్ధి
- ఇతర హామీల అమలుకూ ఉపాధ్యాయుల డిమాండ్

మంచిర్యాల, జూలై27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు నిర్ణయించడంతో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఫైల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం చేయడంతో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. దీంతో తొమ్మిదేళ్ల అనంతరం పదోన్నతులు లభిస్తుండడంతో ఉపాధ్యాయులు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ఏడాదికాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఖాళీ అయిన స్థానాలను పదోన్నతులతో భర్తీచేయాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో అన్ని విభాగాల్లో కలిపి వందమందికి లబ్ధిచేరే అవకాశం ఉంది. వీరిలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సెకండరీస్కూల్ టీచర్‌లు, స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు పదోన్నతులు పొందేవారిలో ఉండనున్నారు.

బదిలీలు చేపట్టాలని డిమాండ్...

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు పదోన్నతులు కల్పించేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నప్పటికీ అదే సమయంలో బదిలీలు చేపట్టాలనే డిమాండ్ కూడ వినిపిస్తున్నాయి. గత సంవత్సరం పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులు మల్టీజోన్ పరిధిలోని వివిధ జిల్లాల మారుమూల ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. వారంతా అక్కడే విధులు నిర్వహిస్తుండగా కుటుంబాలకు దూరమైనవారు అనేక మంది ఉన్నారు. వృద్ధాప్యంతో బాధపడుతున్న తల్లిదండ్రులకు దూరంగా మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నవారంతా తమను సొంత జిల్లాలకు బదిలీ చేయాలనే డిమాండ్‌తో ఉన్నారు. ఆయావర్గాలకు చెందిన ఉపాధ్యాయులు ఇప్పుడు ముందు బదిలీలు నిర్వహించిన తరువాతే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరుతున్నారు. అయితే సాధారణ బదిలీలు నిర్వహించి రెండేళ్లు పూర్తి కాకపోవడంతో బదిలీలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేనట్టు తెలుస్తోంది. దీంతో జీరో ఇయర్ ప్రాతిపదికన బదిలీలు నిర్వహించాలని కొంత మంది కోరినప్పటికీ కొన్ని సాంకేతిక...

- మిగతా 7లో

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

- బండి రమేశ్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సంఘం తరు ఫున స్వాగతిస్తున్నాం.

అయితే ఈ పదోన్నతు లను అడ్‌హక్ పద్ధతిలో నిర్వహించాలి. అలాగే గతం లో మిగిలిపోయిన భాషా పండితులను తప్పనిసరిగా స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలి. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ సంవత్సరం న్నర గడుస్తున్న సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించకపోవడం బాధాకరం.



పీఎస్ హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలి

- డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయ క్రిష్ణ

రాష్ట్ర ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన పదివేల పీఎస్ హెచ్‌ఎం పోస్టుల నుంచి సగం మాత్రమే పదో న్నతులు కల్పించింది. రాష్ట్రం లో 5500పై చిలుకు పదోన్నతులు కల్పించాల్సి ఉంది. వీరిని తక్షణమే పదోన్నతులు కల్పిం చాలి. బీఎడ్, డీఎడ్ అర్హతలు ఉన్నవారందరికి పీఎస్ హెచ్‌ఎం పదోన్నతి కల్పించాలి. బాషా పండితుల పదోన్నతుల ప్రక్రియ పూర్తయినం దున సంబంధిత జీవోలైన 2, 3, 9, 10 రద్దు చేసి జీవోలు 11, 12ల ప్రకారం ఎస్‌జీటీ, ఎల్ పీ, పీఈటీ సీనియారిటి ప్రాతిపదిన పదోన్న తులు కల్పించాలి.



తెలంగాణ క్రికెట్ క్యాంప్‌నకు ఎంపిక



రిత్విక్

బెల్లంపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎవెఎ్మ స్కేప్రసాద్ ఇంటర్ నేషనల్ క్రికెట్ అకాడమిలో ఇటీవల యూత్‌స్టార్ క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్‌జోన్ అండర్-14 విభాగంలో పట్టణానికి చెందిన రిత్విక్ ఎంపికయ్యాడు. ఈ ఎంపిక పోటీల్లో తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈపోటీల్లో రిత్విక్ మంచి ప్రతిభ చాటడంతో తెలంగాణ క్రికెట్ క్యాంప్‌కు ఎంపికయ్యాడు. ఎంపికపట్ల సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

12వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



దీక్షలో పాల్గొన్న ఆటోయూనియన్ సభ్యులు

జన్నారం, జూలై27 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లో భారీ వాహనాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం నాటికి 12వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త భూమాచారి, భద్రీనాయక్ మాట్లాడుతూ ఆంక్షలు ఎత్తివేసే వరకు దీక్షలు విరమింపచేసేది లేదన్నారు. ఆంక్షల వల్ల స్థానిక యువత ఉపాధి కోల్పోతున్నారన్నారు. దీక్షకు మద్దతుగా ఆటోయూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట



మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బెల్లంపల్లి, జూలై27 (ఆంధ్రజ్యోతి): మహిళ సాదికారత కు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌పీ గార్డెన్‌లో నియోజకవర్గ మహిళ శక్తి సంబరాలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్, ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా మహిళా సంఘాలు లాభపడాలనే ఆకాంక్షతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇందిర మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నా రు. వడ్డీలేని రుణాలతో పాటు బ్యాంక్ లింకేజీ, ప్రమాద బీమా, రుణ బీమా వంటి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రభుత్వం నుం చి మహిళలకు పెట్రోల్‌బంక్‌లు, ఎలక్ట్రిక్ బస్సులు అందిస్తూ ఆర్థిక బలోపేతానికి కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతి మహిళా ఒక ఇందిరాగాంధీలా శక్తివంతమైన మహిళగా ఎదగ మని సూచించారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఏ కిషన్, డీపీఎం స్వర్ణలతతో పాటు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

బెల్లంపల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరు ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందుతాయని కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారు డికీ సంక్షేమ పథకాలను అందజేసేందుకు కృత నిశ్చయంతో ఉన్న ట్లు పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, నాయకులు నాతరి స్వామి, బండి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సస్పెన్షన్, షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నాం

చెన్నూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని నల్లగొండ పోచమ్మవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్కే ప్రసాద్‌ను సస్పెండ్ చేసి మరికొందరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈ నెల 24న కేటీఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏస్మైల్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు 30కుర్చీలు అందజేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అమాయక ఉపాధ్యాయులపై తమ పైశాచికత్వాన్ని ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సస్పెన్షన్, షోకాజ్ నోటీసులను ఎత్తివేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

స్వల్పంగా పెరిగిన ఎల్లంపల్లి నీటి మట్టం

హాజీపూర్, జూలై27 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలం గుడిపేట లోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి స్వల్పంగా నీటిమట్టం పెరిగింది. గతేడాది జూలై 27న 18టీఎంసీల నీటి మట్టం ఉండగా ఈ ఏడాది కేవలం 10 టీఎంసీ నీటి మట్టం మాత్రమే ఉంది. జూన్ 2వవారం నుంచి వర్షాకాలం సీజన్ మొదలైనప్పటి నుంచి కేవలం ఒక టీఎంసీపైగానే నీటి సామర్థ్యం పెరిగింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 10.3146 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 10,091కూసెక్కుల నీరు ప్రస్తుతం ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో రూపంలో వస్తుంది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 7207 క్యూసెక్కులు, ఎగువ నుంచి 2884క్యూసెక్కుల నీరువచ్చి చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై కోసం 331క్యూసె క్కుల నీరు, ఎన్టీపీసీ అవసరాలకోసం 161 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ప్రాజెక్టునిర్మాణం అనంతరం ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది లోటు నీటి సామార్థ్యంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉంది.

ఉపాధ్యాయ సంఘం ధర్నాను విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మంచిర్యాలక్రైం,జూలై27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ సమ స్యలను వెంటనే పరిష్కరించాలని యుఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘం ఈనెల1న జరిపే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు చక్రపాణి పిలుపుని చ్చారు. జిల్లాకేంద్రంలో 23నజరిగే ఇందిరాపార్కు మహాధర్నాను విజయవంతం చేసేందుకు ప్రతీఒక్కరు తరలిరావాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన విద్యారంగం ఉపాధ్యాయ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆశించినప్పటికీ వారు ఎక్కడవేసిన గొంగలి అక్కడే చందంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 19 నెలలు గడిచినప్పటికీ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించడంలో విఫలమైంద న్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్, రమేశ్, రాజనర్సు, రాజవేణు, జయక్రిష్ణలు పాల్గొన్నారు.

డెంగీ.. డేంజర్

- వర్షాకాలంలో విజృంభణకు అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన


నిలువ ఉన్న మురుగునీరు

వాంకిడి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమల బెడద పెరిగింది. ఇలాంటి చోట డెంగీ వ్యాప్తికి అనుకూలంగా ఉంటుంది. కొన్నివారాలుగా జిల్లాలో జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతుంది. ఈ జ్వరాలు డెంగ్యూ కావచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● ఎలా వ్యాప్తి..

డెంగీ అనేది ఏడిస్ ఈజిప్టి అనే ఆడ దోమ కాటు ద్వారా వ్యాపించే వైరస్ వ్యాధి. ఈ దోమ పగటిపూట కుడుతుంది. డెంగ్యూ సోకిన వారికి సాధారణంగా 2 నుంచి 7 రోజుల పాటు జ్వరం ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. జ్వరంతో పాటు తల నొప్పి, చర్మంపై దద్దుర్లు, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం అత్యవసరం

● తేలికపాటి లక్షణాలతో..

డెంగీ జ్వరం సాధారణంగా తేలికపాటి లక్షణాలతో ప్రారంభమైనప్పటికీ కొందరిలో ఇది తీవ్రరూపం దాల్చి ప్రాణాంతకంగా మారవచ్చు. డెంగీ వైరస్ శరీ రంలోని రక్తనాళాలను దెబ్బతీసి ప్లేట్‌లెట్ల సంఖ్యను విపరీతంగా తగ్గిస్తుంది. ప్లేట్‌లెట్లు రక్తం గడ్డకట్టడంతో కీలక పాత్ర పోషిస్తాయి. వాటి సంఖ్య తగ్గడంవల్ల శరీరంలో అంతర్గత రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. ఇది జీర్ణవ్యవస్థలో, చర్మంకింద, లేదా ఇతర అవయవాలలో రక్త స్రావా నికి దారితీస్తుంది. జ్వరం తగ్గిన తర్వాత 24-48 గంటలు అత్యంత కీలకమైన సమయం. ఈ సమయంలో కొన్నిలక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రిలో చేరాలి. కడుపులో విపరీతమైన నొప్పి, తరుచుగా వాంతులు కావడం, శ్వాసలో ఇబ్బంది లేదా వేగంగా తీసుకోవడం, చిగుళ్ల ముక్కు నుంచి రక్తంకారడం, నల్లటి మలం, వాంతులలో రక్తం కనిపించడం, చల్లగా, చెమటలు పట్టి బీపీ పడి పోవడం ఈ లక్షణాలు డెంగీ షాక్ సిండ్రోమ్ (డీఎస్ ఎస్)లేదా డెంగీ హెమరేజిక్ ఫీవర్(డీహెచ్ఎఫ్)కు సంకేతాలు కావచ్చు. ఈ దశలో తక్షణ వైద్యసహాయం అందకపోతే అవయవవైఫల్యం సంభవించి మరణానికి దారితీయవచ్చు.

జాగ్రత్తలు ఇలా..

- ఇంటి పరిసరాల్లో, కూలర్లు, కుండీల్లో, టైర్ల లో, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమలు గుడ్లు పెట్టడానికిఇవి అనుకూలం
- ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మురుగునీటి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.
- దోమతెరలు వాడడం మంచిది. దోమల నివారణ క్రీములు లేదా స్ప్రేలు ఉపయోగిండం మంచిది.
- పొడవాటి చేతులున్న దుస్తులు ధరించడం ద్వారా దోమకాటు నుంచి రక్షణ పొందవచ్చు.
- పౌష్టికాహారం తీసుకోవడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం ద్వారా ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చు.

జ్వరం తగ్గకపోతే వైద్యుడిని సంప్రదించాలి..



రెండురోజుల వరకు జ్వరం గత్తకపోతే విధిగా వైద్యుడిని సంప్రదించాలి. లక్షకు తక్కువ గా ప్లేట్‌లెట్ కౌంట్ ఉంటే అప్ర మత్తం కావాలి. డెంగీ వ్యాధి అని నిర్ధారణ అయితే ఆసుపత్రిలో చేర్పించి తగు చికి త్స అందించాలి. డెంగీ వంటి తీవ్రజ్వరాల లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడి సలహా తీసుకోవాలి.

- ఉప్రె వినయ్, వైద్యాధికారి

ప్రశాంతంగా సీఆర్టీ పరీక్ష


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నిర్వహించిన సీఆర్టీ (ఎస్‌జీటీ) పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీజీటీడబ్ల్యూయూ ఆర్‌జేసీ(పీటీజీ బాలుర), ఆశ్రమ బాలికల పాఠశాల, ఆసిఫాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన సీఆర్టీసీ ఎస్‌జీటీ పరీక్ష ప్రశాం తంగా జరిగిందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థు లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదు పాయాలు కల్పించామని అన్నారు, అత్యవసర సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు అందుబాటులో ఉంచామని అన్నారు. పారిశుధ్యం, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలి పారు. నిబంధనల ప్రకారం అభ్యర్థుల ను తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించామని తెలిపారు.

ముగిసిన గ్రామపాలన అధికారుల పరీక్ష

ఆసిఫాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన గ్రామపా లన అధికారుల, లైసెన్స్ సర్వేయర్ల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రామ పాలనాధికారుల ప రీక్షకు 37 మంది హాజరు కావాల్సి ఉండగా 33 మంది హాజరయ్యారు. అలాగే రెవెన్యూ విభాగంలో లైసెన్స్ సర్వేయర్ల నియామకం కోసం రెండు సెషన్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షలకు 97 మంది హాజరు కావాల్సి ఉండగా 80 మంది హాజరైనట్లు పరీక్షల కన్వీనర్లు శ్రీనివాస్, రాందాస్‌లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



నూతన భూగర్భ గనులు ప్రారంభించాలి


మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన భూగర్భ గనులు ప్రారంభించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజ్ అహ్మద్ అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సింగరేణి మెడికల్ బోర్డు అవినీతి మయంగా మారిందని ఆరోపించారు. గతంలో మాదిరిగా రెండేళ్ల సర్వీసు ఉన్న ఉద్యోగులకు అన్‌ఫిట్ చేసి వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అవినీతి పెరిగిపోతున్నా విజిలెన్స్ విభాగం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కొందరు అధికారులు ఉద్యోగుల షిఫ్ట్ మార్చేందుకు, చార్జిషీట్ పెండింగ్‌లో ఉంచడానికి, ప్రమోషన్లు, యాక్టింగుల కోసం డబ్బులు వసూలు చేయడం శోచనీయమన్నారు. ఏదైనా విషయంపై కార్మికులు ప్రశ్నిస్తే వారిని షిఫ్టులు, సెక్షన్లు మారుస్తూ, బదిలీలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. కొన్ని కార్మిక సంఘాలు ఈ విధానాలను మానుకోవాలని హితవుపలికారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని అన్నారు.. సమావేశంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి గోళ్ల సత్యనారాయణ, కోశాధికారి మీన కొమురయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం లక్ష్మణ్, ఎస్‌టీపీపీ నాయకులు సాయిక్రి ష్ణారెడ్డి, ప్రదీప్ రెడ్డి, పిట్ కార్యదర్శులు తుల అనిల్, చెవుల శ్రీనివాస్, నవీన్ కుమార్, సాయి, వెంకటస్వామి, గాండ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త ఆందోళనకు మద్దతు ఇవ్వండి


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24వ తేదీ నుంచి సెప్టెంబర్ 17వ తేదీ వరకు యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే దేశవ్యాప్త ఆందోళనకు కార్మికులు మద్దతు ఇవ్వాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి అన్నారు. ఆర్‌కే 5 గనిపై ఏర్పాటు చేసిన పోస్టర్ల ఆవిష్కరణకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నామన్నారు. నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేయాలని, కొత్తగా నియామకాలు చేపట్టాలని, బొగ్గు ఉత్పత్తిలో కంపెనీలు 50 శాతం శాశ్వత ఉద్యోగుల భాగస్వామ్యం ఉండేలా చూడాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు ఇవ్వాల్సిన బొగ్గు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ కేంద్ర కార్యదర్శి మాదాసు రవీందర్, కోశాధికారి ఆకుల హరి, ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రాజేందర్, కోశాధికారి గూడ శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోళ్ల మహేందర్, ఆర్‌కే 5 పిట్ కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కుమరం భీం ప్రాజెక్టుకు వరద


ఒక గేటు ఎత్తి నీటిని వదిలిన అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు ఆసిఫాబాద్ మండలంలోని కుమరం భీం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 243 మీటర్లు కాగా ప్రస్తుతం 237.15 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 250 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఒక గేటు పైకి ఎత్తి 812 క్యూసెక్కుల వరద నీటిని కిందికి వదులుతున్నారు. పెద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

4న మందకృష్ణ మాదిగ రాక

కాగజ్‌నగర్ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు పెంచాలని కోరుతూ ఆగస్టు 4న కాగజ్‌నగర్‌లో నిర్వహించే సన్నాహక సభకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ రానున్నట్లు, ఈ సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కో ఇన్‌చార్జి మంత్రి మల్లేష్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బన్న మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించే పెన్షన్ దారుల సింహ గర్జన కార్యక్రమంలో భాగంగా జిల్లాల పర్యటనలో మందకృష్ణ మాదిగ రాన న్నట్లు పేర్కొన్నారు. ఈ సన్నాహక సభకు జిల్లాలోని అన్ని రకాల పెన్షన్ దారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

- ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు
- పాఠశాలలో కేటీఆర్ జన్మదిన వేడుకులు నిర్వహణతో అధికారుల చర్యలు

చెన్నూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదిన వేడుకలను రెండు రోజుల క్రితం పాఠశాలలో నిర్వహించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయడంతో పాటు ఏడుగురు ఉపాధ్యాయులకు ఆ శాఖ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు అందించారు. ఈ నెల 24న కేటీఆర్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని నల్లగుంట పోచమ్మవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు 30 కుర్చీలను పంపిణీ చేశారు. అయితే ఆ పార్టీ నాయకులు పార్టీ కండువాలు వేసుకుని పాఠశాలలో జై తెలంగాణ, జై కేసీఆర్, జై కేటీఆర్, జై బాల్క సుమన్ అంటూ విద్యార్థులతో కలిసి నినాదాలు చేశారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఈ చర్యలు పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య విచారణ చేపట్టారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా వ్యవహరించిన ఆర్కే ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెల్లడించారు. విధుల్లో ఉన్న ఐదుగురు ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్టు పీఈటీ, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌కు నోటీసులు అందించారు.

మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

ఇన్‌చార్జి హెచ్ఎం సస్పెన్షన్, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం పట్ల కొన్ని ఉపాధ్యాయ సంఘాలు సమర్థిస్తుండగా మరికొన్ని ఉపాధ్యాయ సంఘాలు మండి పడుతున్నాయి. బీఆర్ఎస్ నాయకులు పాఠశాలకు కుర్చీలు విరాళంగా ఇస్తే ఉపాధ్యాయులకు శిక్ష వేయడం ఏంటని, అంత పెద్ద తప్పుడు వారు ఏం చేశారని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు చెందిన పలువురు నాయకులు ప్రశ్నిస్తున్నారు.

వెంకటాపూర్ అడవిలో మళ్లీ పులి అలజడి

పెద్దపులి దాడిలో లేగదూడ మృతి


లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కాసిపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి అటవీరేంజ్ ధర్మరావుపేట సెక్షన్ పరిధిలోని వెంకటాపూర్‌బీట్ 321కంపార్ట్‌మెంట్‌లో ఆదివారం మధ్యాహ్నం ఆవుల మందపై పెద్దపులి దాడి చేసి లేగదూడను చంపేసిందని బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణ చందర్ తెలిపారు. పశువుల కాపరులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రొట్టేపల్లి పంచాయతీ తోకరగూడెంకు చెందిన పశువుల కాపరి తిరుపతి ఆదివారం మధ్యాహ్నం ఆవుల మందతో వెంకటాపూర్ అటవీశివారు ప్రాంతంలోకి వెళ్లాడు. ఒక్కసారిగా ఆవుల మంద బెదిరి ఆవులన్నీ చెల్లాచెదురు అయ్యాయి. వాటిని ఒక్కచోటికి చేస్తుండగా పెద్దపులి గాండ్రింపులు వినిపించాయని ఆయన తెలిపారు. భయభ్రాంతులకు గురైన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో ముత్యంపల్లి ఫారెస్టు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్ బృందం సంఘటన స్థలాన్ని పరిశీలించగా లేగదూడ మృతి చెందిందన్నారు. పరిసరప్రాంతాలు పరిశీలించగా పెద్దపులి పాదముద్రలను గుర్తించినట్లు అటవీశాక అధికారులు నిర్ధారించారు. లేగదూడ కాసిపేట గోండుకు చెందిన కుర్సింగ అచ్యుత్‌రావుదిగా గుర్తించారు. పంచనామ నిర్వహించిన అనంతరం లేగదూడ కళేభరాన్ని యజమానికి అప్పగించారు. లేగదూడకు సంబంధించిన నష్టపరిహారాన్ని త్వరలోనే యజమానికి అందజేయనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈసందర్భంగా బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు ఒంటరిగా అడవిలోకి వెళ్లరాదని సూచించారు. అటవీ సమీప గ్రామంలో టాంటాం వేయించి సమీప గ్రామాలకు అవగాహన కల్పించారు. సోనాపూర్, లక్ష్మీపూర్, వెంకటాపూర్, రొట్టేపల్లి, అటవీశివారు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెద్దపులికి ఎవరు హానీ తలపెట్టద్దని వన్యప్రాణులను వేటాడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

క్షుద్రపూజల కలకలం

కాసిపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు నెలలుగా కొందరు పూజారులు క్షుద్రపూజలతో జనాన్ని భయభ్రాం తులకు గురి చేస్తున్నారు. రెండు నెలల క్రితం చిన్న ధర్మారానికి చెందిన ఒక రైతు ఇంటి ముందు నిమ్మకాయలు, పసుపుకుంకుమతో పాటు ఒక బొమ్మను పెట్టిన ఘటన అప్పట్లో తీవ్ర సంచలనం రేపింది. అలాగే నెల రోజుల క్రితం కాసిపేటకు చెందిన మరోరైతు ఇంటి ముందు అలాగే పూజలు నిర్వహించడం స్థానికులను భయాందోళనకు గురి చే యడంతో భయాందోళనకు గురయ్యారు. ఈఘటనలు మరువకముందే ఈ నెల 24న అమావాస్య రోజు ముత్యంపల్లిలో ఓ బాలికతో పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చే యగా అప్రమత్తమైన బాలిక తెలివిగా అక్కడి నుంచి తప్పిం చుకొంది. దీంతో ప్రాణాపాయం తప్పిందని కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. భయభ్రాంతులకు గురైన బాలిక కొద్ది రోజుల కిందట స్థానిక పోలీసులను ఆశ్రయించగా ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చినట్లు సమాచారం. ఏదేమైన మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో ఇలాంటి క్షుద్రపూజలు నిర్వహించడం ప్రజలను భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై పోలీసు అధికారులు స్పందించి ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మందమర్రిటౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఒకరి ఇంట్లో ఆదివారం పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రిలో ఒకరి ఇంట్లో రహస్యంగా పట్టణానికి చెందిన ఒకరు, బెల్లంపల్లికి చెందిన కొందరు పేకాట ఆడుతుండగా అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ. 38,150, రెండు సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకునామన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు కృషి చేస్తునామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడిలో ఏఎస్ఐ మిలింద్‌కుమార్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాకేష్, విశ్వనాథ్, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఘనంగా గీతాపారాయణం


గీతాపారాయణం చేస్తున్న మహిళలు

మందమర్రిటౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఈఆర్ క్లబ్ గణపతి మండపంలో ఆదివారం గీతాపారాయణం పఠనం ఘనంగా నిర్వహించారు. కాలనీలోని మహిళ భక్తులు మండపంలో గీతాపారాయణం పఠనం చేశారు. పండితులు చెప్పిన విధంగా భగవద్గీత ముఖ్య సారాంశాన్ని మహిళా భక్తులకు వివరించారు.

రాష్ట్రపతి నిలయం సందర్శిస్తారా..

» విద్యార్థులకు గొప్ప అవకాశం

కోటపల్లి/జైనూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించే అవకాశం వచ్చింది. ఈ మేరకు రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ కె రజనీప్రియ అవకాశం కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఎడ్యుకేషన్ టూర్‌లోభాగంగా విద్యార్థులకు అనుమతి ఇస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారులకు లేఖను జారీ చేశారు. ఈ సంవత్సరం సెప్టెంబరు వరకు పాఠశాలల విద్యార్థులతో పాటు ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు సైతం ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


రాష్ట్రపతి నిలయంలోని మ్యూజియం

● నమోదు ఇలా..

రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించాలనుకున్న పాఠశాల విద్యార్థుల ముందస్తుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. హెచ్‌టీటీపీ://విజిట్.రాష్ట్రపతిభవన్.జీవోవి.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా అనుమతి పొందవచ్చు. నిలయంలోని రిసెప్షన్ కౌంటర్ ద్వారా అనుమతి పొందవచ్చు. వారంలో సోమవారం, ప్రభుత్వ సెలవు రోజులు మినహా మిగితా అన్ని రోజులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శించేందుకు అనుమతి ఇస్తారు. శని, ఆదివారాల్లో రాత్రి 7 గంటల వరకు సందర్శనకు వీలుంటుంది. సాయంత్రం 5 గంటల తర్వాత కళాసంధ్య సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.


సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం

● ఇవి విశేషాలు..

రాష్ట్రపతి నిలయంలో అబ్బుర పరిచే సందర్శన విశేషాలున్నాయి. కిచెన్ టన్నెల్, తెలంగాణ సంస్కృతిని చాటే పెయింటింగ్స్, నాలెడ్జ్ గ్యాలరీ , పూలగార్డెన్‌లు, పచ్చిక బయళ్లు, వుడెన్ ఫ్లాగ్ పోస్ట్, జై హింద్ ర్యాంప్ , మ్యూజికల్ నీటి ఫౌంటెయిన్‌లు , పిల్లల పార్కులు, నాటి వస్తువుల మ్యూజియంతో పాటు హైదరాబాద్ చరిత్ర, హైద్రాబాద్ సంస్థానంలోని గత పాలకుల చరిత్ర , రాష్ట్రపతి విధులపై అవగాహన తదితర విశేషాలను చూడవచ్చు. అలాగే ఈ నిలయంలోని మ్యూజియం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇలాంటి అబ్బుర పరిచే అవ కాశాలున్న రాష్ట్రపతి నిలయం సందర్శనకు అవకాశం వచ్చింది. పాఠశా లల విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుంటే ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా చక్కని ప్రయోజనం విద్యార్థులకు ఒనగూరనుంది.

ఆశ్రమ పాఠశాలలో విచారణ



నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ బృందం సభ్యులకు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థినులు

కోటపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎం అశోక్ విద్యార్థినుల పట్ల అసభ్యం గా ప్రవర్తించాడన్న ఆరోపణల నేపథ్యంలో ఆదివారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ బృందం సభ్యులు విచారణ చేశారు. రాష్ట్ర మహిళ విభాగం చైర్మన్ కమలాబాయి, జిల్లా అధ్యక్షురాలు బనావత్ సరోజ ఆధ్వర్యంలో బృందం సభ్యులు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను కలిసి వారి సమస్యల ను తెలుసుకున్నారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై ఏం చర్య తీసుకున్నారని సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. వారి వద్ద నుంచి వినతి పత్రాన్ని స్వీకరించారు. విద్యార్థినులకు న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కరీంనగర్ జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు అంజలి, వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ విజయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పుట్ట రాజేందర్, ఉపాధ్యక్షుడు సునీల్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఓపెన్' టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరంగాను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యాసకులు ఈనెల 31లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దండేపల్లి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నరేందుల శ్రీనివాస్, సహాయ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావులు ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా జూలై 31వ తేదీలోపు అభ్యాసకులు ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశం పొందేందుకు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాలలో దర ఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 8309769067లో సంప్రదించాలన్నారు.

ఉపాధి కూలీలకు భరోసా



- రూ. 20కే రూ. 2లక్షల బీమా
- పీఎంఎస్‌బీవైతో ఆర్థిక భద్రత
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఈ నెలాఖరు వరకు గడువు

దండేపల్లి జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి స్థానికంగా పనులు కల్పించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి 100 రోజుల పాటు పనులు కల్పిస్తోంది. ఉపాధి పనులు కల్పించడంతో పాటు పని చేసే సమయంలో ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఆదుకునేందుకు బీమా సౌకర్యం సైతం కల్పిస్తోంది. దీంతో ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు మరింత ధీమా పెరుగుతుంది. ప్రధానమంత్రి సురక్ష యోజన పథకంలో చేరడం కోసం ఈనెల 31వ తేదీ వరకు గడువు విధించారు. ఉపాధి కూలీలు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

పీఎంఎస్‌బీవై ద్వారా అమలు

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా బీమా సౌకర్యం కల్పిస్తుంది. ఈ పథకంలో కూలీగా ఉండి 18 నుంచి 70 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులుగా నిర్ణయించారు. కూలీ సంబంధిత జాతీయ బ్యాంకు లో బీమా చేయించుకునేందుకు అంగీకారం కుదుర్చుకోని ప్రతి సంవత్సరం ఉపాధి కూలీ రూ. 20 రూపాయల ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

గాయాలైతే లక్ష.. మృతి చెందితే రూ. 2లక్షలు

ఉపాధి హామీలో పని చేసే కూలీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ఉపాధి హామీ పనులు చేసే సమయంలో నిత్యం ఏదో ఘటన జరుగుతోంది. గాయాలు పాలవడంతో పాటు మృత్యువాత పడిన సందర్భాలు సైతం ఉన్నాయి.

జిల్లాలో ప్రయోజనం

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో చేరి పేర్లను నమోదు చేసుకున్న కూలీలు 1,33,177 మంది ఉండగా, జిల్లాలో 82,020 మంది ఉపాధి కూలీలు యాక్టివ్ జాబ్ కార్డులు కలిగి ఉన్నారు. బీమా యోజన పథకంలో చేరిన వారు మరణించినా, అంగ వైకల్యం బారిన పడ్డా రూ. 2లక్షల పరిహారం చెల్లిస్తారు. ఒకవేళ పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ. లక్ష పరిహారం ఇస్తారు.

ఈ పథకంలో చేరేందుకు జూలై నెలాఖరు వరకు గడువు విధించారు. ఉపాధి హామీ పథకంలో 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు వారు అర్హులు కాగా, బ్యాంకు ఖాతా ఉన్నచోటే పేర్లు నమోదు చేయాలి. ఖాతాకు ఆధార్ కార్డు సంఖ్య అనుసంధా నించాలి. పథకంలో పేరు నమోదు చేయించాక ఏటా ఖాతా నుంచి రూ 20 బీమాకు జమ అవుతుంది. రాత పూర్వకంగా లేఖ ఇవ్వడం తప్పని సరి. అలా అయితేనే పథకం అమల్లోకి వస్తుంది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, సిబ్బంది నమోదుకు స్వీకారం చుట్టారు. మండల స్థాయిలో ఏపీవోలు, సాంకేతిక సహాయకులు (టీఏ)లు పేర్లు నమోదు చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు బీమా ఎంతో ప్రయోజనం
కిషన్ డీఆర్డీవో మంచిర్యాల



గ్రామీణ ప్రాంతాలల్లో నిర్వహించే ఉపాధి హామీని జిల్లా వ్యాప్తంగా మహిళలే అత్యధికంగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనతో ఉపాధి కూలీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రమాదం సంభవిస్తే బీమా అండగా ఉంటుంది. అందరు ఈ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనలో జిల్లాలోని కూలీలందరి పేర్లను నమోదు చేస్తాం. కూలీలకు అవగాహన కల్పించి, వారి ఆధార్, బ్యాంకు ఖాతాల పత్రులను సేకరిస్తాం.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

ఎస్ఐ శ్రీధర్, జైపూర్



జైపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామని జైపూర్‌ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ : నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. దుకాణాలు, దేవాయాల వద్ద సీసీ కె మెరా లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు, వ్యాపారులకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్నాం. అసాంఘీక కార్యక లాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాలని వారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఎస్ఐ : తరుచుగా వాహనాలను తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. మైనర్లు బైక్‌లు నడపకుండా చర్యలు తీసుకుంటున్నాం. మద్యం సేవించి వాహనాలు నడపకుండా డ్రంకెన్ డ్రైవ్ చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : యువత మద్యం, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ : గ్రామాల్లోని యువకులు మద్యం, ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కల్పిస్తున్నాం. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచిస్తున్నాం. క్రీడా పరికరాలను అందజేస్తున్నాం.

పద్మశాలి సంఘం మండల కమిటీ ఎన్నిక

భీమారం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండల పద్మశాలి సంఘం నూతన కమిటీని భీమారంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు బాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుడిమల్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కొక్కుల నరేష్, కోశాధికారిగా గుడిమల్ల నరహరి, గౌర వాధ్యక్షులుగా బండి రాజం, ఉపాధ్యక్షులుగా బండి శ్రీరాములు, సిరిపురం మధూకర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వేణుగోపాల్, అరుణ్‌కుమార్, శేఖర్, సత్యనారాయణ, రోశయ్య పాల్గొన్నారు.



నూతన సభ్యులను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

వరి నాట్లలో వలస కూలీలు

దండేపల్లి జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ పనుల్లో ఇతర రాష్ట్రాల కూలీలు కనిపిస్తున్నారు. ఉపాధి కోసం బీహార్, బెంగాల్ నుంచి ఇక్కడి ప్రాంతాలకు వచ్చి గంప గుత్తగా ఏకరాల చొప్పున నాట్లు వేసేందుకు రేటు మాట్లాడుకుని చకచకా పనులు చేస్తున్నారు. స్థానిక కూలీల కంటే తక్కువ ధరకే వలస కూలీలు పనులు చేస్తుండడంతో వారినే మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం వరినాటు సీజన్‌లో దండేపల్లి మండలంలోని సుమారు 200 మందికి పైగా ఇతర రాష్ట్రాల నుంచి మగకూలీలు వచ్చి వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఒక ఎకరానికి వరినాటు వేస్తే రూ 3500 నుంచి 4000 చొప్పున ఇక్కడి రైతులు వారికి చెల్లిస్తున్నారు.



దండేపల్లి మండలంలో వరినాటు వేస్తున్న వలస కూలీలు

మంత్రి దంపతుల పూజలు



మంత్రి వివేక్‌వెంకటస్వామి సరోజ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

చెన్నూరు/మందమర్రి టౌన్ జూలై 27 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌లోని కర్మాన్ ఘాట్‌లోని హనుమంతుని ఆలయంలో ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సరోజ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడ నుంచి మంత్రి దంపతులు మైసమ్మ తల్లి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. సరోజ బోనం ఎత్తుకుని అమ్మ వారికి సమర్పించి రాష్ట్ర ప్రజలందరు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళ సంఘాల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వైటింక్లయిన్‌కాలనీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బొగ్గు పరిశ్రమ సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ దేశ వ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. ఆదివారం స్థానిక యూనియన్ ఆఫీస్‌లో ఉద్యమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. బొగ్గు పరిశ్రమ పరిరక్షణ, కార్మిక హక్కుల రక్షణకు బీఎంఎస్ చేపట్టనున్న ఆందోళ నలకు కార్మికవర్గం కలసి రావాలని సత్తయ్య పిలుపునిచ్చారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, జూలై27 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని యూత్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం 15వ వార్డులో నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమం అటకెక్కిందన్నారు. రేషన్‌కార్డులు డబుల్‌బెడ్‌రూం గృహాల ఊసేలేదని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలు అందిస్తున్న ఘనత తమదే అన్నారు. రాష్ట కార్మిక ఉపాధికల్పన గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్‌వెంటస్వామి నేతృత్వంలో చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రభాగాన ఉంటుందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్, డబుల్ బెడ్‌రూం గృహాలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో ఆయన ముందున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితో పాటు నాయకులు పైడిమల్ల నర్సింగ్, వెంకటాద్రి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని పొన్నారం గ్రామంలో ఆదివారం ఎంపీడీవో రాజేశ్వర్ లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులను గుర్తించి రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు. రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హరీష్, రేషన్ డీలర్ లింగయ్య, కారోబార్ భానుచందర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య, కాంగ్రెస్ నాయకులు సంతోష్‌కుమార్, రాజలింగు, ఆనంద్, సతీష్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

తాండూర్ : మండల కేంద్రంలోని కిష్టంపేట రైతు వేదికలో సోమవారం ఉదయం 10 గంటలకు లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ పంపిణీ చేస్తారని మండల తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్దిదారులు హాజరు కావాలని కోరారు.

పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్..

(5వ పేజీ తరువాయి)

సమస్యల వల్ల ప్రభుత్వం స్పందిం చలేదు. దీంతో నేరుగా పదోన్నతులు చేపడితే ఆయా వర్గాల వారికి పూర్తి స్థాయిలో న్యాయం జరుగదనే అభిప్రాయంలో ఉన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు పదోన్నతులను అడ్‌హక్ పద్ధతిలో కేటాయించాలని మెజార్టీ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఇతర సమస్యలనూ పరిష్కరించాలి...

రాష్ట్ర ప్రభుత్వం అంచలంచెలుగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ ఇంకా పెండింగ్‌లో ఉన్నవాటిని కూడా సత్వరమే పరిగణలోకి తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా పెండింగ్ బిల్లుల కోసం నిధులు కేటా యించాలని కోరుతున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్య నిధి నుంచి రుణాలు పొందగోరే ఉపాధ్యాయులకు సైతం తక్షణమే మంజూరయ్యేలా అవసరమైన నిధులు కేటాయించాలనే డిమాండ్లు ఉన్నాయి. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏలతో పాటు పీఆర్‌సీ ఊసే ప్రభుత్వం ఎత్తకపోవడంతో ఉపాధ్యాయులంతా ఒకింత అసహనానికి గురవుతున్నారు. సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులంతా ఉద్యమబాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

జిల్లాలో వందమందికిపైగా లబ్ధి..

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో జిల్లా వ్యాప్తంగా వందమందికి పైగా ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో పోస్టు గ్రాడ్యు యేట్ హెడ్‌మాస్టర్ పోస్టులు 25 ఖాళీలు ఉన్నాయి. మల్టీజోనల్ ప్రమోషన్లు కావడంతో ఉన్న ఖాళీల్లో జిల్లాకు చెందిన 15 మందికి పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించే అవకాశం ఉంది. ఈ పదోన్నతుల్లో ఇతర జిల్లాలకు చెందిన వారికి కూడ మంచిర్యాలలో పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది. పదోన్నతుల ప్రక్రియలో భాగంగా జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు, బాషా పండితులు, పీఎస్ హెచ్‌ఎంలు అన్ని కలిపి జిల్లాలో వంద మందికి పైగా పదోన్నతులు లభించనుండడంతో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. మునుగుతున్న పంటలు

రాపల్లి రైతుల ఆందోళన

హాజీపూర్, జూలై27 (ఆంధ్రజ్యోతి): మట్టికాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తమ పంటలు ముగుతున్నాయని మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సింగాపూర్, రాపల్లి శివారులో సుమారు 200 ఎకరాల భూముల నుంచి వచ్చే వరదనీటిని రాపెల్లి శివారులోని 61 సర్వే నెంబర్‌లో పట్టాదారుగా ఉన్న కాంట్రాక్టర్ లగిశెట్టి రాజయ్య అడ్డు కట్ట వేశాడని రైతులు తహసీల్దార్, కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. రాపెల్లి శివారు సర్వే నెంబర్ 61లో గతంలో బోడగుట్టగా పిలిచే సుమారు 6 ఎకరాల భూమిని కాంట్రాక్టర్ కొనుగోలు చేసి అందులో ఉన్న గుట్టకు సంబంధించిన మట్టితో వ్యాపారం చేసుకున్నాడు. మట్టిని తరలించిన అనంతరం అందులో ఉన్న జీవకాలువలను ఆనవాళ్లు లేకుండా చేయడంతో పై నుంచి వచ్చే వరదనీరు కిందకు పోకుండా చుట్టుపక్కల ఉన్న పంట పొలాలను ముంచేస్తున్నాయని సంబంధిత రైతులు వాపోతున్నారు. తహసీల్దార్ ఫిర్యాదు చేయడంతో తూతూ మంత్రంగా జేసీబీతో చిన్న కాలువను తీశారని ఆ కాలువగుండా నీరు పారడం లేదని ఎగువనుంచి వస్తున్న వరదనీరు ముందుకు పోలేక పంట పొలాలు మునుగుతున్నాయని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. రైతు ఏనుగు భూపతి, ఆనే మల్లయ్య, ఆనే మల్లేశ్, ఎసాంతుల శంకరయ్య, బొప్పు అమృతరావు, ఆనే శంకరయ్యలు ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మునిగిన పంటను చూపిస్తున్న రైతులు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి



అధికారులను వేడుకుంటున్న నసీమాబేగం

కోటపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో తాము దుర్భర జీవితం కొనసాగిస్తున్నామని, నాయకులు, అధికారులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని శెట్‌పల్లి గ్రామానికి చెందిన ఒంటరి మహిళలు నసీమాబేగం, షమీమ్‌బేగంలు కోరారు. ఆదివారం వారు విలేకరులకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తమను అధికారులు, నాయకులు చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో నసీ మా బేగం వికలాంగురాలు కాగా, మరో మహిళ షమీ మ్‌బేగం నిరుపేద కుటుంబానికి చెందినది. ఒంటరిగా తాము బతుకుతున్నామని, తమ ఇళ్లు కూలిపోయే పరిస్థితుల్లో ఉన్నాయని, నాయకులు స్పందించాలని వారు కోరారు. గతంలో ఇందిరమ్మ కమిటీకి పంచాయతీ కార్యదర్శికి, అధికారులకు చెప్పినా తమకు ఇళ్లు మంజూరు కాలేదని, దిక్కు లేకుండా ఉన్న తమకు ఇళ్లు మంజూరు చేయాలని వీరిద్దరు విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ తీగలపై పడిపోయిన చెట్టు

స్పందించిన సింగరేణి విద్యుత్ సిబ్బంది

మంద మర్రిటౌన్, జూలై27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడవ జోన్‌లోని విద్యుత్ లైన్ల పై చెట్టు పడింది. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. సింగరేణి క్వార్టర్ల వద్ద ఉంటున్న ఓ వ్యక్తి చెట్టును కొట్టడంతో కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడడంతోనే తీగలన్ని కిందపడిపోయాయని కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సింగరేణి వర్కుషాపు సిబ్బందికి చెప్పడంతో వారు వెంటనే స్పందించారు. మధ్యాహ్నం నుంచి ప్రత్యేకంగా కాంట్రాక్టు కార్మికులను పిలిపించి తెగిన తీగలను మరమ్మతులు చేసి విద్యుత్ పునరుద్ధరించారు.

చెట్టు కొట్టిన, కొట్టించిన వ్యక్తి గురించి ఆరా తీశారు. విద్యుత్‌ను పునరుద్ధరించడంతో కాలనీవాసులు సింగరేణి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



తీగలపై పడ్డ చెట్టు

బురదమయంగా రహదారులు



బురదమయంగా మారిన భాజీపల్లి రహదారి

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

భీమారం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని కొత్తపల్లి, ఎల్కేశ్వరం, భీమారం, బూరుగుపల్లి, దాంపూర్, కాజీపల్లి, నర్సింగాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని రోడ్లు బురదమయంగా మారాయి. రో డ్లను బాగు చేయాలని అధికారులు, నాయకులకు చెప్పినా ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డుపై నిరంతరం నీరు ప్రవహిస్తుందని, దీంతో ఈ రోడ్డు గుండా వెళ్లలేకపోతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో నీరు నిల్వ ఉంటోందని రోగాలు వస్తున్నాయని పేర్కొంటున్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే సమయం కాబట్టి చిన్న పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు ఏర్పడతాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



భీమారం మండల కేంద్రంలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



పంటలకు ఊపిరి

- జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- పత్తి, ఇతర పంటలకు ప్రయోజనం
- వరినాట్లకు సన్నద్ధమవుతున్న రైతులు



వరి నాట్లు వేస్తున్న రైతులు



చింతలమానేపల్లిలో పెరుగుతున్న పత్తి పంట

చింతలమానేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు రోజులుగా కురు స్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి. గత నెలలో కురిసిన అడపాదడపా వర్షాలకు జిల్లాలో పత్తి, కంది, సోయా ఇతర పంటలు సాగు చేశారు. కానీ వరి నాట్లు చాలా మంది రైతులు వేయలేదు. వర్షాలు గత నెలలో చాలా తక్కువ వర్షపాతం నమోద వడం, పంటలకు అనుకూలంగా లేక పోవడంతో రైతులు దిక్కులు చూశారు. కానీ ఈ వర్షంతో రైతులకు ఊరట లభించడంతో వరి నాట్లు వేసుకోవడానికి అనుకూలంగా ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో రైతాంగం పంటల సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

• 4.5 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో వ్యాప్తంగా 1.23 లక్షల మంది రైతులు ఉండగా 4.5 లక్షల ఎక రాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. అందులో మెజార్టీ రైతులు పత్తి పంట సాగు చేస్తుండగా 3,35,363 ఎకరాల్లో సాగవుతోంది. వరి 56,861 ఎకరాల్లో సాగవుతోంది. కంది 30,430 ఎకరాలు, మొక్కజొన్న 1000, ఇతర పంటలు 1500 ఎకరాల్లో సాగవుతున్నాయి. వర్షాల ఆశించిన స్థాయిలో కురవడంతో పంటలో ఎరువులు వేయడం, మందులు పిచికారి చేయడం, గడ్డి తొలగించడం వంటి పనులు చేయడానికి పనుల్లో నిమగ్న మయ్యేందుకు రైతులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరి నాట్లు వేసుకోవడానికి సైతం రైతులు నారు మడులు సిద్ధం చేసుకోవడం వంటి పనులు చేపడుతున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో వచ్చే అవకాశం ఉన్నదని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కానీ జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతమే నమోదైంది. బెజ్జూరు, రెబ్బెన, వాంకిడి, కాగజ్‌నగర్, చింతలమానేపల్లి మండలాల్లో సాధరణం కంటే ఎక్కువగా కురిసింది. మిగిలా మండలాల్లో సాధరణం కంటే తక్కువగానే ఉంది. వానాకాలం సీజన్ నుంచి భారీ వర్షం కరువలేదు.

• పలు మండలాల్లో..

జిల్లాలోని పలు మండలాల్లో వరినాట్లు మొదలయ్యాయి. చింతలమానేపల్లి, దహెగాం, సిర్పూర్, బెజ్జూరు, కౌటాల. పెంచకలపేట మండలాల్లో వరి నాట్లు షూరు అయ్యాయి. కొందరు బోర్లతో పాటు వర్షం నీటితో పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో తిర్యాణిలో చెలిమల వాగు, డోల్బులవాగు, గుండాలలోని చెరువుల కింద మొలక అలుకుతున్నారు. ఆసిఫాబాద్, రెబ్బెన మండలాల్లోని వట్టివాగు ఆయకట్టు దారులు నాట్లు వేసేందుకు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. కాగా మెట్ట పం టకు ఈ వర్షంతో అవసరమైన ఎరువులు వేయాలని ఇతర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవ సాయ అధికారులు సూచనలు చేస్తున్నారు. ముఖ్యంగా పం టల్లో కలుపు లేకుండా చూడడం, సమయానికి ఎరు వులు వేయడం, తెగుళ్ల సోకకుండా తెగుళ్ల నివారణ కోసం మందులు స్ప్రే చేయడం వంటి పనులతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతున్నారు.

ఆశించిన స్థాయిలో వర్షాలు..

- పోశయ్య, రైతు



జిల్లాలో నాలుగు రోజులుగా ఆశించిన వర్షాలు కు రుస్తున్నాయి. మెట్ట పంటల పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం వరినాట్లు వేసేందుకు రైతులు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. పది రోజుల క్రితం వరకు భారీ వర్షాలు లేక పోవడంతో పొలాలు దున్నడం లాంటి పనులు చేయలేదు. పత్తి పంటలో ఇప్పటికే గడ్డి తొలగించడం, మందులు స్ప్రే చేయడం వంటి పనులు చేపట్టాం. ఇప్పటికైతే పంటకు అనుకూలమైన వాతావరణం ఉంది.

నేటూర్‌లో పెసా గ్రామసభ



మాట్లాడుతున్న పెసా కోఆర్డినేటర్ మారుతి

సిర్పూర్(యు), జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేట్నూర్(కే) గ్రామంలో ఆదివారం పెసా గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా పెసా కోఆర్డినేటర్ గేడం మారుతి మాట్లాడుతూ చదువుతోనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు తమ పిల్లలు చదువుపై ప్రత్యేక దృషిసారించేలా శ్రద్ధ వహించాలని సూచిం చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలన్నారు. చదువుకునే వయస్సు గల పిల్లలందరూ బడిలోనే ఉండేలా చూడాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు గిరిజన ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని చెప్పారు. అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామసభలో మాజీ సర్పంచ్ ఆర్క నాగోరావు, నాయకులు మడావి బొజ్జీరావు, గంగారాం, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

దహెగాం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం లగ్గాం గ్రామానికి చెందిన ఎల్లయ్య ఇటీవల తన ఫోన్ పోగొట్టుకుని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గుర్తించి ఎస్సై విక్రమ్ బాధితుడికి ఆదివారం అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్‌లో అందిన ఫిర్యాదు మేరకు ఫోన్ ను గుర్తించి బాధితుడికి అందజేశామని తెలిపారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

సిర్పూర్(టి), జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో సిర్పూర్(టి) మండలానికి కొత్తగా మంజూరు అయిన 282 రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేయనున్నామని తహసీల్దార్ మహమ్మద్ రహీముద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంపిణీ కార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే హరీష్‌బాబు హాజరవుతారని పేర్కొన్నారు

ఆకట్టుకుంటున్న కెరమెరి ఘాట్స్



కెరమెరి ఘాట్ రోడ్డు

కెరమెరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కెరమెరి ఘాట్స్ అందాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఘాట్ దట్టమైన అడవీ మీదుగా మెలికలు తిరిగి ఉంటుంది. ఇక్కడి నుంచి ప్రకృతి రమణీయ దృశ్యాలు కనువిందు చేస్తాయి. కొండల వరుసలు, రంగులు మారుతు న్నట్లు కనిపించే దృశ్యాలు ప్రయాణికులను ఆకట్టుకుంటాయి. ఆసిఫాబాద్- ఉట్నూర్ - ఆదిలాబాద్ వెళ్లె ప్రయాణికులు ఈ ఘాట్ రోడ్డు నుంచి వెళ్లాల్సి ఉంటుంది. 18 మూలమలుపులు, వంకలు తిరిగిన రోడ్డు ఉంటుంది. కెరమెరి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఘాట్ రోడ్డు మొదలవుతుంది. సుమారు తొమ్మిది కిలోమీటర్ల మేర ఎత్తైన కొండలు, సయ్యాద్రి పర్వత శ్రేణుల్లో ప్రయాణం వాహనదారులకు కనువిందు చేస్తోంది. ఈ ఘాట్ రోడ్డు నైజాం రాజులు పాలించిన రోజుల్లో నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు.



ఘాట్‌రోడ్డుపై మూలమలుపులు

మహాధర్నాను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న తుడుం దెబ్బ నాయకులు

సిర్పూర్(యు), జూలై 27 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదు సోమవారం ఆదివాసీ సంఘాల అధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కుమ్రం భీం కోరారు.మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలోని తాడోబా-అందారి టైగర్ రిజర్వ్ ఫారెస్టును అనుసంధానం చేస్తూ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 339 గ్రామల్లో టైగర్ కన్జర్వేషన్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తు ప్రభుత్వం జీవో 49 జారీ చేసిందన్నారు. దీంతో జిల్లాలోని ఆయా గ్రామల ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుతుందని చెప్పా రు. ఆదివాసీలు ఆడవిని నమ్మి జీవనం కొనసాగిస్తున్నామన్నారు. టైగర్ కన్జర్వేషన్ కారిడార్ జీవో 49ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిలో భాగంగానే కలెక్టరేట్ ఎదుట మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఆధిక సంఖ్యంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, తుడుం దెబ్బ నాయకులు మడావి నగేష్, గేడం మారుతి, లచ్చన్న,సిడం సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


కొండగొర్రెను అడవిలో వదలిన అధికారులు



కొండగొర్రెను అడవిలో వదిలి పెడుతున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవిచంద్ర కాలనీ సమీపంలోకి ఆదివారం వచ్చిన కొండగొర్రెను పట్టుకుని తిరిగి అడవిలోకి వదిలి వేసినట్లు డిప్యూటీ రేంజర్ యోగేష్ తెలిపారు. పట్టణంలోని రవిచంద్ర కాలనీకి సమీపంలో కొండగొర్రె వచ్చిందని తమకు సమాచారం అందిందని అక్కడికి వెళ్లి దానిని రక్షించినట్లు తెలిపారు. అడవిలో నుంచి పరిగెత్తే క్రమంలో కాలుకు గాయమైందన్నారు. గుర్తించి స్థానిక పశువైద్య ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి అడవిలో వదిలేసినట్లు తెలిపారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అబ్దుల్ కలామ్, కత్తి పద్మారావు చిత్రపటాలకు పూలమాల వేస్తున్న నాయకులు

వాంకిడి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జైత్వాన్ బుద్ధవిహార్‌లో దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, దళిత ఉద్యమ నేత కత్తి పద్మారావు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. ప్రయాణికుల ఇబ్బందులు



ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలు

జైనూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పవర్‌గూడ నుంచి జైనూర్ వరకు ప్రధాన రోడ్డుపై అడుగుకో గుంత పడడంతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కుమరంభీం జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ జిల్లాకు రాక భారీ వాహనాలు రాకపోకలు సాగిసుంటాయి. కొన్ని వాహనాలు నిబంధన లకు విరుద్ధంగా అధిక లోడుతో వెళుతుండడంతో రోడ్డుపై గంతలు పడ్డాయి. దీంతో ఆర్టీసీ బస్సులు, బైక్‌పై వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తున్నా గుంతలకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకో వడం లేదని ప్రజలు వాపోతున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు చేరితే బైక్‌పై వెళ్లే వారు అదుపుతప్పి పడిపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలు పూడ్చి వేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలు లేక అవస్థలు

- రోడ్డు పక్కన నిలిచిన వర్షం నీరు



సిర్పూర్(టి)లో ప్రధాన రోడ్డు పక్కల నిలిచిన వర్షపునీరు

సిర్పూర్(టి), జూలై 27 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని బస్టాండు ఏరియా, రైల్వే స్టేషన్ ఏరియా, డౌనల్ ఏరియా తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీలు నిర్మించలేదు. దీంతో వర్షపు నీరు రోడ్లపైనే గుంతల్లా మారి నిలిచి ఉంటుంది. మేజర్ గ్రామ పంచాయతీ అయినప్పటికీ డ్రైనేజీలు నిర్మించలేదు. అధికారులు పట్టించుకోక పోవడంతో పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. వర్షాకాలం అయినందున ఇరుపైలా గుంతల్లో నీరు నిలువడం వల్ల దోమల వృద్ధి చెంది విష జ్వరాల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆన్‌లైన్‌లో విధానంలోనే..

- భవిష్యత్తులో విద్య, ఉద్యోగ పరీక్షలు పూర్తి స్థాయిలో కొనసాగే అవకాశం

వాంకిడి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చాలా పోటీ పరీక్షలు, ముఖ్యంగా పెద్ద సంస్థలు నిర్వహించేవి ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తున్నాయి. కానీ అన్ని పోటీ పరీక్షలు ఆన్‌లైన్‌లో లేవు. పోటీ పరీక్ష అంటే హాల్‌టికెట్లు, ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నా పత్రాల కోడ్ సంఖ్యలు ఇవన్నీ గతంలో... ప్రస్తుతం బయోమెట్రిక్ హాజరు, ఫేస్‌రి గ్నేషన్ సిస్టం, ఆన్‌లైన్‌లోనే హాజరునమోదు, విద్యా, ఉద్యోగ పరీక్షలన్నీ ఆన్‌లైన్ విధానంలో జరుగనున్నాయి. పోటీ పరీక్షలు రాసే విద్యార్థు లు, డిపార్టుమెంట్ పరీక్షలు రాసే ఉద్యోగులు ఆన్‌లైన్ విధానంపై పట్టుసాధించాల్సిందేనని నిపుణులు చెబుతున్నాడు.

కార్పొరేట్ సంస్థలతో పాటు..

కార్పొరేట్ సంస్థలతో పాటు జీఆర్‌ఈ, టోఫెల్, నీట్ వంటి వాటికే పరిమితమైన ఆన్ లైన్ విధానం భవిష్యత్తులో అన్ని పోటీ పరీక్షలకు అమలు చేయనున్నారు. ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు ఎలాంటి అవకతవకతలకు తావివ్వకుండా పారదర్శకంగా ఈ విధానాన్ని ప్రభుత్వాలు అమలు చేయనున్నాయి. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ పోటీ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణను ప్రధాన కార్యాలయం నుంచి తనిఖీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. బయోమెట్రిక్ హాజరుతో ఒకరికి బదులు మరొ కరు పరీక్షలు రాసే అవకాశముండదు. గంటల వ్యవధిలోనే ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఈ సెట్, ఐఐటీ, ఎంసెట్, టీఆర్టీ, ఉద్యోగ, ఉపాధ్యాయ డిపార్ట్ మెంటు, గ్రూప్-1, 2 పరీక్షలు సైతం విజయవంతం కావడంతో అన్ని ఉద్యోగ పరీక్షలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

సందేహాల నివృత్తికి..

పరీక్ష సమయంలో కంప్యూటర్ తెరపై వచ్చే ప్రశ్నకు కిందున్న ఐచ్ఛికాల్లో ఒకదాన్ని సమాధానంగా గుర్తించాలి. ఒక ప్రశ్నకుసమాధానం గుర్తించిన తర్వాత అవి ఆన్‌లైన్ సహకారంతో నేరుగా ప్రధాన సర్వర్‌లో నమోదవుతాయి. పరీక్ష పూర్తయిన తర్వాత గుర్తించిన సమాధానల నకలు పొందడానికి వీలుంటుంది. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ప్రతి కళాశాలలో అవసరమైన కంప్యూటర్లు, నిరంతర విద్యుత్ వసతి, బయోమెట్రిక్ పరికరాలు, సీసీ కెమెరాలు సమకూర్చకోవాలి.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం



కోనప్పకు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

కాగజ్‌నగర్ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్ లతా రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను ఆదివారం ఘనంగా సన్మానించారు. వరంగల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోనప్ప చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి లతా రాజా ఫౌండేషన్ 19వ ధార్మిక్ సేవ అవార్డ్‌లో భాగంగా ఘనంగా సన్మా నించారు. ఏటా దేశంలోని సేవా సంస్థలకు లతా రాజా ఫౌండేషన్ అవార్డులను అందచేస్తోంది. దీంట్లో భాగంగా కోనప్పకు నిర్వాహకులు పురస్కారం అందజేశారు.

శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం

- వర్షాలకు ఉరుస్తున్న గదులు
- తడిసిపోతున్న సామగ్రి
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో భవనం

బెజ్జూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. ఇటీవల కురు స్తున్న వర్షాలకు ఎంపీడీవో కార్యాలయం గదులు ఉరుస్తుండడంతో అధికారులు, వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కురుస్తున్న భారీ వర్షాలకు పైకప్పు నుంచి వర్షపు నీరు పడుతుండడంతో కంప్యూటర్లు, ఫైళ్లు తడిసిపోతున్నాయని అధికారులు వాపోతున్నా రు. ఈ భవనం సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించారు. నిత్యం వివిధ పనుల కోసం వివిధ గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇదే కార్యాలయంలో ఉపాధి హామీ పథకం కార్యాలయం సైతం ఉండడంతో నిత్యం ఉపాధి కూలీలు వస్తుంటారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో వర్షపు నీరు చేరి ఇబ్బందికరంగా మారింది. కార్యాలయంలో కంప్యూటర్లు, ఫైళ్ల ఎక్కడ తడిసి పోతాయోనని అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. ఏ గది చూసినా వర్షపు నీటితో కనబడుతుం డడంతో వచ్చి పోయే ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన కార్యాలయంకు మరమ్మతులు చేస్తేనే ఇబ్బందులు తొలగిపోతాయని చెబుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌ను సంప్రదించగా వర్షాల కారణంగా గదులు ఉరుస్తున్నాయని చెప్పారు. కార్యాలయంలో ఎక్కడ చూసినా వర్షపు నీరు నిలిచి ఉంటుందని, మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు తెలిపారు.



గదిలో చేరిన వర్షం నీరు